# గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు

**ఆధారాలు సమర్పించి.. సీజ్ చేసిన సొత్తు తీసుకోవచ్చు.. ఇప్పటి వరకు మేడ్చల్‌లో రూ. 45 కోట్లు సీజ్**

మేడ్చల్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు చేపడుతున్న ప్రత్యేక తనిఖీల్లో భాగంగా మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో రూ. 45 కోట్లకు పైగా విలువజేసే ఆభరణాలు, నగదు పట్టుబడింది. తనిఖీల్లో సీజ్ చేసిన నగదు, ఆభరణాలకు సంబంధించిన ఆధారాలు సమర్పించి.. తిరిగి తీసుకునేందుకు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి గౌతమ్ గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఎన్నికల సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ముమ్మరంగా అన్ని ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నగదు, ఆభరణాలు, మద్యం తరలించకుండా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. ఎన్నికల కోడ్ వెలువడినప్పటి నుంచి ఇప్పటి వరకు తనిఖీల్లో రూ. 45.25 కోట్ల విలువైన నగదు, బంగారం, వెండి ఇతర ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రూ. 16.73 కోట్ల నగదు కాగా.. రూ. 28.51కోట్ల విలువైన బంగారం, వెండి, ఇతర అభరణాలు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు. దీంతో పాటు ఆబ్కారీ శాఖకు సంబంధించి 1,503 లీటర్ల మద్యం పట్టుకుని, 298 కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసుల్లో 200 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు.



## గ్రీవెన్స్ కమిటీని సంప్రదించాలి

- జిల్లా కలెక్టర్ గౌతమ్

తనిఖీల్లో సీజ్ చేసిన నగదు, ఆభరణాలను తీసుకునేందుకు రశీదులు, సాక్ష్యాలతో గ్రీవెన్ కమిటీని సంప్రదించాలి. సీజ్ చేసిన నగదు, ఆభరణాల అంశాన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉన్న ఫిర్యాదుల కమిటీ పరిశీలిస్తుంది. కమిటీలో కమిటీ కన్వీనర్‌గా జిల్లా సహకార అధికారి శ్రీనివాస మూర్తి, సభ్యులుగా డీటీవో నర్సింహా రావు, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి పద్మజారాణిని నియమించాం. సరైన ఆధారాలు చూపిస్తే నగదు, ఆభరణాలు తిరిగి ఇస్తారు. అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, వివాహం.. ఇతర అవసరాలకు తీసుకువెళ్లే నగదు, ఆభరణాలకు సంబంధించిన పత్రాలు వెంట ఉండాలి. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి రూ. 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లరాదు. సీజ్ చేసిన నగదు, నగలు విడుదలకు గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్ శ్రీనివాస మూర్తి(9100115724), నర్సింహా రావు(7799934204), పద్మజా రాణి (7330999280)ని సంప్రదించాలి.. అని కలెక్టర్ సూచించారు.



## రాచకొండకు ఏడు కంపెనీల కేంద్ర బలగాలు

- సరైన పత్రాలు లేకుంటే నగదు, ఇతర వస్తువులను సీజ్ చేస్తాం
- రాచకొండ సీపీ, డీఎస్ చౌహాన్

సిటీబ్యూరో, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాచకొండ పోలీస్ కమిషనరేట్‌కు కేంద్ర సాయుధ పోలీసు బలగాలు వచ్చాయని సీపీ డీఎస్. చౌహాన్ తెలిపారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లోని పోలీస్ సిబ్బందికి సహాయంగా ఏడు కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు తొలి విడతలో వచ్చాయని వివరించారు. ఈ బలగాలు స్థానిక పోలీస్ సిబ్బందితో కలిసి ఆయా నియోజకవర్గాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పకడ్బందీగా బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. శాంతి- భద్రతల సమస్య తలెత్తకుండా ఉండేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పాత నేరస్థులను బైండోవర్ చేస్తున్నామన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అవసరమైన అన్ని ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. అక్రమంగా నగదు, మద్యం తరలింపు వంటి నేరాలను అడ్డుకోవడంలో భాగంగా ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. సరైన పత్రాలు లేకుండా నగదు, నగలు, తదితర వస్తువులు తరలిస్తే సీజ్ చేస్తామన్నారు.

## ఓ మహిళపై.. ఇద్దరు మహిళల అఘాయిత్యం

- మత్తు మందిచ్చి లైంగికదాడి.. ఆపై దోపిడీ
- ఆలస్యంగా వెలుగులోకొచ్చిన అసహజ ఘటన



వెంగళరావునగర్, అక్టోబర్ 22: మద్యం మత్తులో ఉన్న ఇద్దరు మహిళా కామ పిశాచులు, మరో మహిళకు కూల్ డ్రింక్‌లో మత్తు మందిచ్చి అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆ తర్వాత బాధితురాలి ఒంటిపై ఉన్న బంగారాన్ని దోచేశారు. ఈ ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్ డివిజన్‌కు చెందిన ఓ వివాహిత మహిళ (38) ఈ నెల 13వ తేదీ సాయంత్రం తన భర్తతో గొడవ పడి, ఇంటి నుంచి బయటకు వచ్చింది. యూసుఫ్‌గూడ బస్‌స్టాప్ వద్ద రాత్రి నిద్రకు ఉపక్రమించింది. ఆ సమయంలో ఆమె వద్దకు ఇద్దరు మహిళలు వచ్చారు. ఇక్కడ ఎందుకు నిద్రపోతావు.. పక్కనే మా ఇల్లు ఉంది.. వచ్చి పడుకో.. ఉదయం లేచిపో.. అంటూ ఆప్యాయంగా పలుకరించారు. వారి మాటలు నమ్మిన బాధితురాలు.. వారితో పాటు ఆటోలో బ్రహ్మశంకర్‌నగర్‌లోని ఓ ఇంటికి వెళ్లింది. బాధితురాలికి ఆ ఇద్దరు మహిళలు కూల్‌డ్రింక్ ఇచ్చారు. కొద్దిసేపటికి బాధిత మహిళ మత్తులోకి వెళ్లిపోయింది. మత్తులో ఉన్న ఆమెపై ఇద్దరు మహిళలు తమ పైశాచికత్వాన్ని చూపించారు. ఆమెను వివస్త్రను చేసి అఘాయిత్యానికి పాల్పడ్డారు. శరీరమంతా గోళ్లతో రక్కి, గాయపరిచారు. ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసు, చెవిదిద్దులను బలవంతంగా లాక్కొన్నారు. బాధిత మహిళ ప్రతిఘటించే ప్రయత్నం చేసినా.. ఆమెపై దాడి చేశారు. బాధితురాలు అక్కడి నుంచి తప్పించుకొని భర్త వద్దకు వచ్చి.. జరిగిన విషయాన్ని చెప్పింది. గాయపడిన ఆమెను వెంటనే ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనపై మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చిన బాధితురాలు.. మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. అఘాయిత్యానికి పాల్పడిన ఒక మహిళను అదుపులోకి తీసుకున్నారు. కల్లు కంపౌండ్ అడ్డాగా ఇద్దరు మహిళలు కలిసి పలువురు మహిళలతో ప్రకృతి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పోలీసులు గుర్తించారు. అసహజమైన శృంగారానికి అలవాటు పడటంతో పాటు దోపిడీ, దొంగతనాలకు కూడా ఆ ఇద్దరు మహిళలు పాల్పడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగానే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ప్రాణం తీసిన వీడియో కాల్


పరుచూరి మణికంఠ(ఫైల్)

వెంగళరావునగర్, అక్టోబర్ 22: అపరిచిత యువతితో మాట్లాడిన వీడియో కాల్‌తో ఓ యువకుడు సైబర్ నేరగాళ్లకు చిక్కాడు. డబ్బు కోసం ఆ నేరగాళ్ల బెదిరింపులతో మనస్తాపం చెందిన ఆ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఎస్‌ఆర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పి.వి.రామప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ బాపట్లకు చెందిన పరుచూరి మణికంఠ(22) బీటెక్ పూర్తి చేశాడు. సాఫ్ట్‌వేర్ శిక్షణ కోసం ఇటీవలే నగరానికి వచ్చాడు. ఎస్‌ఆర్ నగర్‌లోని శ్రీ లక్ష్మీనర్సింహ డీలక్స్ బాయిస్ హాస్టల్‌లో నాగవెంకట అజయ్‌సాయి, లక్ష్మీనారాయణ, అనిల్, అభిరామ్‌తో కలిసి ఓ గదిలో ఉంటున్నాడు. ఇటీవల మణికంటకు ఓ గుర్తు తెలియని యువతి వాట్సాప్ కాల్ చేయడంతో మాట్లాడాడు. దీంతో సైబర్ నేరగాళ్లు మణికంఠ నగ్న వీడియోను రూపొందించి బెదిరింపులకు పాల్పడ్డారు. తమకు డబ్బు చెల్లించాలని, లేదంటే నగ్న వీడియోను మిత్రులు, కుటుంబ సభ్యులకు పంపుతామని బెదిరించారు. ఆగంతకుల డిమాండ్ మేరకు ఓసారి రూ.10 వేలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాడు. అయినా వారి వేధింపులు ఆగలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందాడు. శనివారం సాయంత్రం గది నుంచి బయటకు వెళ్లిన సహచరుడు నాగ వెంకట అజయ్‌సాయికి ఫోన్ చేశాడు. రూ.5 వేలు కావాలని కోరాడు. తన వద్ద అంత డబ్బు లేదని అజయ్ సాయి చెప్పాడు. అజయ్‌సాయి రాత్రి తిరిగి వచ్చి చూస్తే గది లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. హాస్టల్ నిర్వాహకుడు మహేంద్ర, ఇతరులు కలిసి పోలీసులకు సమాచారమిచ్చారు. గది తలుపులు తెరిచి చూడగా.. సీలింగ్ ఫ్యాన్‌కు మణికంఠ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## స్విగ్గీ కస్టమర్ కేర్ నంబర్ వెతికితే..

- మహిళను మోసగించిన సైబర్ నేరగాళ్లు
- బ్యాంకు అకౌంట్ నుంచి డబ్బు కాజేసిన నిందితులు
- మధురానగర్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు

వెంగళరావునగర్, అక్టోబర్ 22 : ఆర్డర్ చేసిన బిర్యానీ దుర్గంధం రాగా.. ఫిర్యాదు చేసేందుకు స్విగ్గీ కస్టమర్ కేర్ నంబర్ వెతికేందుకు ప్రయత్నించగా.. బాధితురాలు సైబర్ నేరగాళ్ల వలకు చిక్కింది. నేరగాళ్లు బాధితురాలి బ్యాంకు అకౌంట్ నుంచి డబ్బు కాజేశారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడ ఎస్‌పీఆర్ హిల్స్‌కు చెందిన బాధితురాలు బిర్యానీ కోసం స్విగ్గీలో ఆర్డర్ చేసింది. పార్సిల్‌లో వచ్చిన ఆ బిర్యానీ దుర్వాసన రావడంతో.. తన డబ్బును తిరిగి రాబట్టుకునేందుకు ఆన్‌లైన్‌లో స్విగ్గీ కస్టమర్ సర్వీస్ ఫోన్ నంబర్ కోసం సెర్చ్ చేసింది. ఆ ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయగా.. వాట్సాప్‌లో లింక్ పంపామని.. క్లిక్ చేయాలని అవతలి నుంచి ఆమెకు జవాబు వచ్చింది. పాన్ కార్డు, ఆధార్ కార్డ్, ఫోన్ పే పాస్‌వర్డ్ వివరాలన్నీ ఆమె నుంచి రాబట్టారు. చివరికి బాధితురాలి బ్యాంక్ అకౌంట్‌లోని రూ.9,999లను ఫోన్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. తన అకౌంట్ నుంచి డబ్బు డెబిట్ అయిన విషయాన్ని మెసేజ్ ద్వారా తెలుసుకున్న బాధితురాలు.. తాను మోసపోయానని గ్రహించి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. యువతిని మోసం చేసిన వంచకుడు

వెంగళరావునగర్, అక్టోబర్ 22 : ప్రేమించానని.. పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించాడు ఆ వంచకుడు. కోరిక తీర్చుకున్నాక మోహం చాటేశాడు. మరో యువతిని పెళ్లాడేందుకు సిద్ధమయ్యాడు. బాధిత యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. కడపకు చెందిన భాష అలియాస్ బాబా హైదరాబాద్ మాదాపూర్‌లో నివాసముంటున్నాడు. యూసుఫ్‌గూడ జవహర్ నగర్‌కు చెందిన యువతి(30)ని ప్రేమ పేరుతో లోబర్చుకున్నాడు. మరో యువతిని పెళ్లి చేసుకునే యత్నంలో.. ప్రేమించిన యువతిని దూరం పెట్టసాగాడు. ప్రియురాలి ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేశాడు. ప్రియుడి చేతిలో మోసపోయిన ఆ యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## జూబ్లీహిల్స్ సొసైటీకి మురళీముకుంద్ రాజీనామా

బంజారాహిల్స్, అక్టోబర్ 22: పని మనిషిపై లైంగికదాడి చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మురళీముకుంద్ జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయనతో పాటు ఆయన కుమారుడు ఎ.ఆకర్ష్ కృష్ణ సొసైటీ కోశాధికారి పదవికి కూడా రాజీనామా చేశారు. తన ఇంట్లో పనిచేస్తున్న యువతి(22)పై లైంగికదాడి చేశారనే ఆరోపణలు ఎదుర్కొన్న మురళీముకుంద్‌పై బంజారాహిల్స్ పోలీసులు మూడురోజుల కిందట పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా.. బాధితురాలు ఎస్సీ అని తేలడంతో మురళీముకుంద్‌పై ఎస్సీ అట్రాసిటీ కేసు సైతం నమోదు చేశారు. ఇదే వ్యవహారంలో మురళీముకుంద్ కుమారుడు ఆకర్ష్ కృష్ణపై సైతం కేసు నమోదైంది. కాగా, తమపై కేసులు నమోదు కావడం, పలు రకాల ఆరోపణలు రావడంతో నైతిక బాధ్యత వహిస్తూ మురళీముకుంద్, ఆకర్ష్ కృష్ణ ఆదివారం తమ పదవులకు రాజీనామా చేశారు. వీరి రాజీనామాలను సొసైటీ అధ్యక్షుడు కృష్ణదేవరావు ఆదివారం ఆమోదించారు.

### కొనసాగుతున్న దర్యాప్తు..

పనిమనిషిపై లైంగికదాడికి పాల్పడ్డాడని మురళీముకుంద్‌పై కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బాధితురాలు ఇచ్చిన ఆధారాలతో పాటు సీసీ ఫుటేజీలు కూడా సేకరిస్తున్నారు. బాధితురాలు ఎస్సీ కులానికి చెందిన యువతి కావడంతో లైంగికదాడి కేసుతో పాటు ఎస్సీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేశారు. దీంతో కేసు విచారణ అధికారిగా బంజారాహిల్స్ ఏసీపీ సుబ్బయ్యను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను ఏసీపీ సుబ్బయ్య స్వీకరించారు.

## మేడిపల్లిలో రూ. 4.53 కోట్లు పట్టివేత

పీర్జాదిగూడ, అక్టోబర్ 22: ఎన్నికల నేపథ్యంలో మేడిపల్లి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం మల్కాజిగిరి ఎస్‌వోటీ, మేడిపల్లి పోలీసులు కలిసి నిర్వహించిన తనఖీల్లో బోడుప్పల్ కమాన్ సమీపంలో రూ.3.21 కోట్లు, పీర్జాదిగూడలోని డెకథ్లాన్ వద్ద రూ.1.32 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన నగదును సంబంధిత ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.